శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించాలి

ఇక్రిశాట్ జెనీబ్యాంక్‌ను సందర్శించిన పంజాబ్ అగ్రి పరిశోధకుల బృందం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను ప్రోత్సహించేలా అగ్రి పరిశోధకులు కృషి చేయాలని ఇక్రిశాట్‌ను సందర్శించిన అగ్రి పరిశోధకుల బృందం పేర్కొన్నది. అధిక దిగుబడి, రోగ నిరోధకత ఎక్కువగా ఉన్న వంగడాలను రూపొందించి వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను పెంపొందించడమే లక్ష్యంగా ఇక్రిశాట్‌లోని జెనీబ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ పరిశోధకులు డెవలప్ చేసిన జన్యు బ్యాంక్‌లోని వంగడాలను పరిశీలించారు. జాతీయ వ్యవసాయ పరిశోధన వ్యవస్థ(ఎన్ఏఆర్ఎస్) ప్రతినిధుల బృందం జెనీబ్యాంక్‌తో కలిసి జెర్మ్‌ప్లాసమ్ ఎగుమతి, దిగుమతులపై చర్చించారు. ఇక్రిశాట్, ఎన్ఏఆర్ఎస్ మధ్య భాగస్వామ్యంతో వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేసే అంశంపై చర్చించినట్లుగా ఇక్రిశాట్ వర్గాలు వెల్లడించాయి.

ఓటును మించిన ఆయుధం లేదు

ఓటరు అవగాహన రన్‌ను ప్రారంభించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

రన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, కమిషనర్ రొనాల్డ్‌రాస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిభాసింగ్, జోనల్ కమిషనర్ స్నేహ శబరీస్, తదితరులు

కొండాపూర్, ఏప్రిల్ 10 : ఓటును మించిన ఆయుధం లేదని, బుల్లెట్ కన్నా బ్యాలెట్ గొప్పదని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ.. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిషిపేషన్) కార్యక్రమంలో భాగంగా 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో ఏర్పాటు చేసిన '2కే రన్'కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి కీలకమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, స్వేచ్ఛాయుతంగా నైతిక ఓటింగ్ చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. అవగాహన రన్ బొటానికల్ గార్డెన్ నుంచి హైటెక్స్ మెటల్ చార్మినార్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిభా సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఎంబీతో బీఎఫ్ఐ ఒప్పందం

లైఫ్ సైన్సెస్ పరిశోధనలు మరింత విస్తరించేలా సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), బ్లాక్‌చైన్ ఫర్ ఇంపాక్ట్ (బీఎఫ్ఐ) కలిసి పనిచేయనున్నాయి. దేశంలో బయో మెడికల్ పరిశోధనల పరిధిని విస్తరించడమే లక్ష్యంగా ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం జరిగింది. సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, బీఎఫ్ఐ సీఈవో డాక్టర్ గౌరవ్ సింగ్, ప్రొగ్రాం డైరెక్టర్ డాక్టర్ సత్యప్రకాశ్ సింగ్ ఇతర పరిశోధకుల బృందం ఆధ్వర్యంలో బుధవారం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. పరిశోధన సంస్థలు, ఇంక్యుబేటర్లను ఒకే వేదికపై కార్యకలాపాలు నిర్వహించే ప్రణాళికల్లో భాగంగా ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 6 లక్షల డార్ల ఆర్థిక సాయాన్ని సీసీఎంబీకి ఇవ్వనున్నది. ఈ నిధులతో వచ్చే మూడేండ్లలో పరిశోధన మౌలిక వసతులను పెంచనున్నారు. రీసెర్చ్, శిక్షణ వంటి అంశాల్లో సీసీఎంబీ కీలకంగా వ్యవహరిస్తున్నది. ఈ క్రమంలో ఆధునిక పరిశోధన విధానాలను విస్తృతస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇరు సంస్థలు కృషి చేయనున్నాయి. ఆలోచనలను పంచుకుంటూ నెట్‌వర్క్ పెంపొందించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా రీసెర్చ్ రంగంలో మరిన్ని వినూత్న ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని, ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలను కనుగొనే అవకాశం ఏర్పడుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. *– హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)*

సైబర్ సెక్యూరిటీపై పుస్తకావిష్కరణ

సైబర్ సెక్యూరిటీపై మెరుగు రవికుమార్ రాసిన 'సైంటో మెట్రిక్ టూల్స్ అండ్ టెక్నిక్స్' అనే పుస్తకాన్ని బుధవారం టీఎస్ఎల్‌పీఆర్‌బీ, చైర్మన్, అదనపు డీజీ వీవీ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. *– సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)*

మెట్రో స్టేషన్‌లో కితాబ్ లవర్స్ బుక్ ఫెయిర్

బుక్ ఫెయిర్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న పుస్తక ప్రియులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సాహిత్య ప్రియులకు ఒక చక్కని అనుభూతిని అందించేందుకు 'కితాబ్ లవర్స్ బుక్ ఫెయిర్'తో ఎల్‌అండ్‌టీ మెట్రో చేతులు కలిపింది. అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ మెట్రో స్టేషన్‌లోని కాన్‌కోర్స్ లెవల్‌లో పుస్తక ప్రియుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీని ఏర్పాటు చేసింది. పుస్తక పఠనానికి ప్రేరణ కలిగించే దిశగా ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు బుక్ ఫెయిర్ ఉంటుందని, అన్ని వయస్సుల వారు ఇష్టపడే నవలలు, జీవిత చరిత్రలు, ఉత్కంఠభరితమైన సాహసాలు, మనస్సుకు హత్తుకునే పిల్లల కథలతో కూడిన పుస్తకాలు ఇందులో ఉంటాయని ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని పుస్తక ప్రియులు ఒక్క చోట చేరేందుకు, పుస్తక పఠనాన్ని వేడుకగా జరుపుకునేందుకు అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో అందరికీ అనువైన ప్రాంతమన్నారు. ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు పొందిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీశ్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు బుక్ ఫెయిర్ ఉంటుందని ఎల్‌అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరదరాజన్ తెలిపారు.

రంజాన్ మాసంలో చివరి రోజు కావడంతో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని పలు హోటళ్లలో హలీం కోసం భారీగా తరలివచ్చిన పజలు

నేడే రంజాన్

''శరీరాన్ని కాదు పాపాన్ని శుష్కింపజేసుకోవాలి.. ఆహారాన్నే కాదు అపసవ్య ధోరణులనూ ఆపేయాలి.. మనసును చెడు ఆలోచనలకు దూరంగా ఉంచాలి.. అదే ఉపవాసం.. అలాంటి ప్రార్థనే దైవ సమ్మతం..'' ఇదే రంజాన్ ఇచ్చే సందేశం. నగరంలో గురువారం రంజాన్ వేడుకలు జరుగనున్నాయి. శాంతి పూర్వక వాతావరణంలో రంజాన్ పండుగ నిర్వహించుకోవాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. చార్మినార్, సికింద్రాబాద్, బహదూపుర, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో రంజాన్ శోభ సంతరించుకున్నది. గురువారం ముస్లిం సోదరులు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకుంటారు. ముస్లింలు తమ ఇంట్లో పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన వివిధ తీపి వంటలను హిందువులు, పేద ప్రజలకు పంపిణీ చేస్తారు. కొత్త బట్టలు ధరించి నమాజ్‌ను చేస్తారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకుంటారు. **- సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)**



బేగంపేటలోని పాటిగడ్డ జామియా మసీద్ వద్ద కనిపించిన నెలవంక

బేగంపేటలోని పాటిగడ్డ జామియా మసీద్ వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

హోమియోపతి విశిష్టతను చేరవేయాలి

హైకోర్టు జడ్జి సుధ

రామంతాపూర్, ఏప్రిల్ 10: హోమియోపతి విశిష్టతను మారుమూల ప్రాంతాలకు చేరవేసే బాధ్యత హోమియో విద్యార్థులపై ఉందని తెలంగాణ హైకోర్టు జడ్జి సుధ అన్నారు. బుధవారం రామంతాపూర్ ప్రభుత్వ హోమియో కళాశాలలో హోమియో పితామహుడు సామ్యూల్ హనీమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న హనీమాన్ విగ్రహానికి జడ్జి సుధ, హోమియో ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 500 మంది వైద్య విద్యార్థులచే హోమియో వాక్ నిర్వహించారు. అనంతరం ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ.. హోమియో సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ముందుందన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా నిధులు తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. పిన్సిపాల్ డాక్టర్ లింగరాజు మాట్లాడుతూ.. హోమియో వైద్యం ప్రస్తుతం ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ పార్థసారధి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సుధ

100 శాతం ఓటింగ్ జరగాలి

- అసెంబ్లీ ఎన్నికల్లో 50శాతం మించని పోలింగ్ బూత్‌లపై ఫోకస్
- రానున్న 25 రోజుల పాటు స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయండి
- మే 13న పోలింగ్ ప్రక్రియలో పాల్గొని ఓటు వేసేలా చైతన్యపరచాలి
- ఏఆర్‌వో, స్వీప్ నోడల్ అధికారుల సమావేశంలో రొనాల్డ్‌రాస్

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. 100 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. బుధవారం బుద్ధభవన్‌లోని సమావేశ మందిరంలో ఏఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, స్వీప్ నోడల్ అధికారులతో ఓటింగ్ శాతం పెరుగుదల, స్వీప్ కార్యక్రమాల కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో 50శాతం కన్నా తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రానున్న 25 రోజుల పాటు స్వీప్ కార్యక్రమాలు విస్తృతం చేయాలని, అందుకు అవసరమైన యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని, రోజువారీగా వివిధ వర్గాల ప్రజలతో పలు రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, సెక్టోరల్ అధికారులు ఇంటింటికి తిరిగి, ప్రతి ఓటరును ఓటు వేసేలా చైతన్య పరచాలని చెప్పారు. ఎస్‌హెచ్‌జీల సహకారంతో ఇంటింటికి తిరిగి ఓటరు కార్డు చూసి, ఓటు ఎక్కడ ఉంది? ఓటరు జాబితాలో పేరు ఉన్నది.. లేనిది చెక్ చేయాలన్నారు. పూర్తి స్థాయిలో ఏఆర్ఓలు పర్యవేక్షించాలని తెలిపారు.

బ్యానర్లు, వాల్ పోస్టర్లు ఏర్పాటు చేయండి

కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్, టూరిజం ప్లేసెస్, ప్రార్థన మందిరాలు, బస్ షెల్టర్లు, ప్రధాన కూడళ్లు, ఎగ్జిబిషన్ ఉన్న అన్ని స్థలాల్లో, అన్ని మార్కెట్ యార్డుల్లో, పబ్లిక్ పార్కులు, బస్టాండ్‌లలో, రెస్టారెంట్‌లలో ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని కమిషనర్ సూచించారు. మే 13న ఓటు వేయాలని వాల్‌పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యార్థులకు ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగించుకోవడంపై మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ ఆర్వో హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు, స్వీప్ నోడల్ అధికారి అరుణకుమారి పాల్గొన్నారు.

వేసవి ఆటలకు వేళాయె..

- 25 నుంచి వేసవి శిక్షణ తరగతులు
- 37 రోజులు.. 44 రకాల ఆటలు
- 16 చోట్ల ఈత కొలనులను ఏర్పాటు చేసిన బల్దియా

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణకు జీహెచ్ఎంసీ సన్నద్ధమైంది. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు 37రోజుల పాటు 44 క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 353 క్రీడా మైదానాలలో ఆరు సంవత్సరాల వయస్సు నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలలో క్రీడా నైపుణ్యతను పెంపొందించి నిష్ణాతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు. ఈ మేరకు 2024 వేసవి శిక్షణ తరగతుల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 44 క్రీడలతో పాటు 16 స్విమ్మింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ సారి రాజకీయ నాయకుల జోక్యం లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు ప్రారంభోత్సవాలు, ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నెల 17న విక్టరీ ప్లే గ్రౌండ్‌లో స్పోర్ట్స్ గేమ్ ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లు, ప్లేయర్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత ఆరు జోన్లలో రోజుకో జోన్ చొప్పున కోచ్‌లతో సమావేశం ఉంటుంది. ఈ నెల 20న క్రీడా సామగ్రిని సంబంధిత బాధ్యులకు అప్పగించనున్నారు. 25న సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రారంభించి.. వచ్చే నెల 6వ తేదీ నుంచి స్పోర్ట్స్ క్విజ్ పోటీలు, పదవ తరగతి– ఇంటర్ సెంటర్స్‌కు టోర్నమెంట్స్ మే 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, చెస్, క్యారమ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, కబడ్డీ, రోలర్ స్కేటింగ్, సిపాక్ త్రో, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, టెన్నికోట్, వాలీబాల్ కలిపి మొత్తం 16 రకాల క్రీడా టోర్నమెంట్‌లను నిర్వహించనున్నారు. 27 నుంచి 31వ తేదీ వరకు రోజుకో జోన్‌లో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాలు చేపట్టి విజేతలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. స్పోర్ట్స్ కోచ్ క్యాంపులలో రిజిస్ట్రేషన్‌కు రూ.50 ఫీజు షటిల్ బ్యాడ్మింటన్, రోలర్, స్కేటింగ్, క్రికెట్, టెన్నిస్ ఇతర గేమ్‌లకు రూ.10 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు www.sports.ghmc.gov.inలో నమోదు చేయాలని అధికారులు సూచించారు.

అక్రమ నీటి వ్యాపారం.. 18 బోర్లు సీజ్

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన గండిపేట రెవెన్యూ అధికారులు

మణికొండ, ఏప్రిల్ 10: ఎట్టకేలకు గండిపేట రెవెన్యూ అధికారులు అక్రమ నీటి వ్యాపారంపై ధ్వజమెత్తారు. ఈనెల 4న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పైన గంగా కింద బెంగా.. కారణం జలగలేనా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గండిపేట రెవెన్యూ అధికారులు తీవ్రస్థాయిలో స్పందించారు. బుధవారం తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్‌రెడ్డి, సురేశ్ ఆధ్వర్యంలో చట్టవిరుద్ధంగా ఉన్న 18 బోర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ఖానాపూర్‌లోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై వాల్టా యాక్టు చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఖానాపూర్ గ్రామ పరిధిలోని 18 బోర్లను బుధవారం స్వయంగా పరిశీలించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గండిపేట మండల పరిధిలో వేసవి తాపం తీవ్రస్థాయిలో ఉందని, ప్రధానంగా ఖానాపురం, వట్టినాగులపల్లి గ్రామాల్లో నీటి వ్యాపారం చేసినట్లయితే వారిపై కచ్చితంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని వెల్లడించారు. ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో ప్రతిరోజు కోటి లీటర్ల తాగునీటిని అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారని, దీంతో ఆ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఇకపై తాగునీటి వ్యాపారం చేసినట్లయితే భూ యజమానులు, నీటి వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి మొదటి విడతగా ఖానాపూర్‌లో 18 బోర్లను సీజ్ చేశామని, వీటిని తొలగించి వ్యాపారాలు కొనసాగిస్తే వారిపై నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే తాము ఈ దాడులు చేశామని, వాటిని బేఖాతరు చేస్తే కచ్చితంగా జైలుపాలు అవుతారని ఆయన హెచ్చరించారు. ఆర్ఐలు విక్రమ్‌రెడ్డి, సురేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బోరును సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

బార్ అసోసియేషన్లు ప్రారంభం

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునఃరుద్ధరించిన బార్ అసోసియేషన్లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రావు బుధవారం ప్రారంభించారు. అదే విధంగా మీసేవ, పోస్ట్ ఆఫీసు, న్యాయవాదుల లంచ్‌హాళ్లు, కక్షిదారులు న్యాయవాదులతో కలిసి మాట్లాడేందుకు నిర్మించిన ప్రత్యేక హాల్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో జస్టిస్ కె.సురేందర్‌రావుతోపాటు జిల్లా జడ్జి ప్రేమావతి, సీబీఐ జడ్జి రమేశ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఉప సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలపాటు ఉచితంగా భోజనం, వసతితో కూడిన కోచింగ్ అందిస్తామని తెలిపారు. కాగా, వంద మందికి అవకాశం ఉందని, ఇందులో 16 మంది అడ్మిషన్ పొందగా.. మిగిలిన 84 సీట్లకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఉండదనున్నదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదని, బీఎడ్ ఉత్తీర్ణతతో పాటు టెట్ అర్హులై ఉండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 92931 42542, 99859 59385 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి..

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10 : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించుటకు ఆసక్తి గల సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బి.బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి మే 31వ తేదీ వరకు 14 ఏండ్ల లోపు వయస్సు కలిగిన బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు(క్రీడలు) నిర్వహించాలన్నారు. క్రీడలు, ప్రదేశములు, గ్రామం, మొబైల్ నంబర్‌తో సహా వివరాలతో కూడిన దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనం, క్రీడా సామగ్రి అందజేస్తామని తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు..

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 10: దేవరయాంజాల్ ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ బిల్డింగ్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో 13వ బ్యాచ్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నీషియన్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్ (రిపేరింగ్) మొదలైన వాటిలో శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం, 7989405049, 9290217274 నంబర్లలో సంప్రదించాలన్నారు.

12 నుంచి వైశాఖి ఉత్సవాలు

అమీర్‌పేట్, ఏప్రిల్ 10: ఖల్సాపంత్ 325వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్(అమీర్‌పేట్) ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి మూడురోజుల పాటు వైశాఖీ ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గురుద్వారా సాహెబ్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సర్దార్ సురిందర్‌సింగ్ వివరాలు వెల్లడించారు. గురుద్వారా సాహెబ్ అమీర్‌పేట్ వేదికగా జరిగే ఈ వైశాఖి ఉత్సవాల్లో పాల్గొనేందుకు నగరంతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దాదాపు 50వేల మందికిపైగా సిక్కులు, ఇతరులు తరలి వస్తారన్నారు. అమీర్‌పేట్ గురుద్వారా, గురుగోబిండ్‌సింగ్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గురుద్వారా సాహెబ్ ఉపాధ్యక్షులు సర్దార్ లాహోర్ సింగ్, సర్దార్ కుశ్వంత్‌సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న గురుద్వారా సాహెబ్ ప్రతినిధులు